సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం ♦ 29 ♦ ఆగస్టు ♦ 2023



ఈ యువతకు ఏమైంది?

జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రస్తుతం నేర సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. ఇందులో అత్యధికంగా యువతే ఉంటుండడం కలవరపాటుకు గురి చేస్తోంది. - 8లో



టీడీపీ నేత ఫామ్‌హౌస్‌లో తనిఖీలు

ముంబై డ్రగ్స్ మాఫియా ముఠా సభ్యుడు విడిది చేసిన టీడీపీ నేత ఫామ్‌హౌస్‌లో రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డిలు తనిఖీలు నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 294 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	340	606
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 494.380 కిలోలు



న్యూస్‌రీల్

వీఆర్‌ఓ సస్పెన్షన్

పీలేరు రూరల్ : విధి నిర్వహణలో అలసత్వం వహించిన గూడరేవుపల్లె వీఆర్వో రెడ్డిరాణిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ గిరీషా ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలావున్నాయి. మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నంబరు 198లో 3.50 ఎకరాలు, సర్వే నంబరు 200/4లో ఒక ఎకరా, 760/4లో ఒక ఎకరాతో పాటు పలు చోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా రెడ్డిరాణి నిర్లక్ష్యంగా ఉన్నారు. ఫలితంగా సస్పెన్షన్‌కు గురయ్యారు.

నేటి నుంచి శిక్షణ

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న 450 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నేటి (మంగళవారం)నుంచి సెప్టెంబరు 24వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 112 మంది ఉద్యోగుల చొప్పున ఒక బృందంగా విభజించి నాలుగు విడతలుగా ఆరు రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. 29 నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు తొలి విడత, సెప్టెంబరు 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రెండో విడత, సెప్టెంబరు 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మూడో విడత, సెప్టెంబరు 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నాలుగో విడత శిక్షణ ఉంటుందన్నారు. మదనపల్లి డివిజన్ పరిధిలోని గోల్డెన్ వాల్యూ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు డీపీవో వివరించారు. కార్యదర్శులు తప్పక హాజరు కావాలన్నారు.

నేడు క్రీడా ప్రతిభా పురస్కారాలు

రాయచోటిటౌన్: రాయచోటి బాలికోన్నత పాఠశాలలో క్రీడా ప్రతిభా పురస్కారాల ప్రధానం చేయనున్నట్లు డీఈవో శ్రీరాం పురుషోత్తం.డీవైఈవో వరలక్ష్మి,స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత సయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం (ఆగస్టు 29) జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 5 పాఠశాలలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ముఖ్య అతిథిగా హాజరవుతారని డీఈఓ చెప్పారు.

బాధ్యతల స్వీకరణ

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్‌గా రవీంద్రారెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం డీఈవో శ్రీరాం పురుషోత్తంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి పాఠశాల ఆవరణం పచ్చదనంతో కళకళాడే విధంగా మొక్కలు పెంచాలని సూచించారు. డీవైఈవో వరలక్ష్మి, కార్యాలయ ఏడీ ప్రసాద్ బాబు, పీఆర్‌టీయూ క్రమశిక్షణ సంఘం చైర్మన్ శ్రీనివాసరాజు, జిల్లా స్కౌట్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి,జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



ఎస్.సారా

రైల్వేకోడూరు : జార్ఖండ్‌లో ఈ నెల 22వ తేదీన జరిగిన జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో రైల్వేకోడూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు.నేషనల్ చాంపియన్‌షిప్‌లో అండర్ -14లో ఎస్.సారా, అండర్ 16లో వై.యశ్విని విజేతలుగా నిలిచారు. విద్యార్థులను సోమవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య, సీడీ జయలక్ష్మి, పీఈటీ మయూరి, కోట్ మాలా సత్కరించి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్(ఒకేషనల్) బోధించే అతిథి అధ్యాపకుడి పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకటరెడ్డి తెలిపారు. ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ లేదా బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్/ఐటీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆగస్టు 30వ తేదీలోగా తమ దరఖాస్తులను gjpeleruboys@gmail.comకు పంపవచ్చునని, లేదా నేరుగా కళాశాలలో అందజేయవచ్చునని తెలిపారు. ఆగస్టు 31న గురువారం తమ బయోడేటా, ధ్రువపత్రాలతో కళాశాలలో హాజరు కావాలని తెలిపారు.

పెనగలూరులో..

పెనగలూరు : పెనగలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల సబ్జెక్టు బోధనకు అతిథి అధ్యాపకుడు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9440917709లో సంప్రదించాలన్నారు.

9న ఎస్ఐ నమూనా పరీక్ష

కడప స్పోర్ట్స్ : కడప బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో సెప్టెంబర్ 9వ తేదీన ఎస్ఐ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మణికంఠ తెలిపారు. సెప్టెంబర్ 9వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు పరీక్ష జరుగుతుందన్నారు. రీజనింగ్ 40 మార్కులు, అర్థమ్యాటిక్స్ 40, కరెంట్ అఫైర్స్ 40, ఇంగ్లీషు 20, జనరల్ సైన్స్ 30, జనరల్ నాలెడ్జ్ 30 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పురోగతి బాట

గునికుంట్ల రింగ్ రోడ్డు వరకు దారి నిర్మాణానికి	- రూ. 4.15 కోట్లు
తానా నుంచి హనుమాన్ జంక్షన్ వరకు	- రూ. 15 కోట్లు
ఆర్ అండ్ బి అతిథి గృహం నిర్మాణానికి	- రూ. 1.50 కోట్లు



రాయచోటిలోని ఎంఐజీ లే అవుట్ వరకు ప్రస్తుతం వేసిన డబల్ లేన్ రోడ్డు



రాయచోటిలో నిర్మించిన ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

- అధునాతన హంగులతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం
- ప్రారంభానికి ముస్తాబైన డీఎస్పీ కార్యాలయం
- ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన గునికుంట్ల రింగ్‌రోడ్డుకు ఫోర్ లేన్ రోడ్డు

సాక్షి, రాయచోటి : అన్నమయ్య జిల్లా అభివృద్ధి వైపు పయనిస్తోంది. ఎక్కడ చూసినా అభివృద్ధి పనులతో పురోగతి కళ్లకు కనిపిస్తోంది. మరోప్రక్క సంక్షేమ పథకాలతో ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తోంది. ఎక్కడికక్కడ ప్రజలకు అన్ని వసతులను సమకూరుస్తోంది. అనాదికాలంగా కరవుతో అల్లాడిన రాయచోటి ప్రాంతం... అన్నమయ్య జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత రూపురేఖలు మారాయి. ప్రజలకు సౌకర్యాల కల్పనలో భాగంగా అన్ని రంగాల్లో రాయచోటిని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించి అందుకు అనుగుణంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పన మొదలుకొని ప్రజల ఆహ్లాదం, ఆటలు ఇలా అన్ని రంగాల్లో పురోగతి బాట పట్టిస్తున్నారు.

రాయచోటికి రోడ్లతో మహర్దశ

జిల్లా కేంద్రమైన రాయచోటిలో రహదారులకు మహర్దశ పట్టింది. రాయచోటిలోని సుండుపల్లె రోడ్డుకు సంబంధించి మెయిన్ రోడ్డు (ఠాణా) నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ఫోర్ లైన్ రహదారితో కొత్త కళ వచ్చింది. సుమారు రూ. 16 కోట్లతో రోడ్డును అద్భుతంగా తీర్చిదిద్దారు.

- రాయచోటి పట్టణంలోని గునికుంట్ల రోడ్డుకు సంబంధించి పట్టణం నుంచి రింగ్ రోడ్డు వరకు డబుల్ లైన్ రోడ్డును అద్భుతంగా రూపుదిద్దుకుంది.
- రూ. 4.15 కోట్లతో రెండు వరుసల రహదారి, అటు, ఇటు ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ నీటికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో చూడటానికి అద్భుతంగా కనిపిస్తోంది. రింగ్‌రోడ్డు నుంచి ఎంఐజీ లేవుట్ వరకు వేసిన డబుల్ లేన్ రోడ్డు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నేతాజీ సర్కిల్ నుంచి బస్టాండు వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమం ప్రారంభమైంది. అలాగే కలెక్టరేట్ సమీపంలోని ప్రధాన రహదారిలో సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి.

అధునాతన హంగులతో అతిథిగృహం

జిల్లా కేంద్రమైన రాయచోటిలో చాలా రోజులుగా అతిథి గృహం లేక ఉన్నతాధికారులు మొదలుకొని వీఐపీలకు ఇబ్బందులు తప్పేవి కావు. జిల్లా పర్యటన నిమిత్తం వచ్చినా...ఇతర కారణాలతో అధికారులు రాయచోటిలో అగినా ప్రభుత్వ అతిథిగృహం లేకపోవడంతో రాత్రిపూట బస చేసేందుకు అటు హార్సిలీ హిల్స్ వైపు గానీ, ఇటు కడపకు గానీ వెళ్లేవారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషాల చొరవతో రాయచోటికి ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని తీసుకురావడంతోపాటు పనులు వేగవంతం చేయించారు. ఆర్‌అండ్‌బీ గృహం అందుబాటులోకి తేవడంతో ప్రయోజనకరంగా మారింది. అలాగే ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి సమీపంలోనే డీఎస్పీ కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. శిల్పారామం వద్ద చదును చేసే పనులు కొనసాగుతున్నాయి. ఆటలకు సంబంధించి క్రీడామైదానాన్ని అద్భుతంగా తీర్చిదిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇలా పట్టణంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులతో కొత్త ఒరవడి కనిపిస్తోంది.

పట్టణానికి కొత్త శోభ

జాతీయ రహదారిలోని ఎస్పీ కార్యాలయ సమీపంలోని రింగ్ రోడ్డులో నెలకొల్పిన అన్నమయ్య విగ్రహం అందరినీ విశేషంగా ఆకర్షిస్తోంది. అంతేకాకుండా రాయచోటి పట్టణం బస్టాండు వరకు పెట్టిన పలువురు మహనీయుల విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రాయచోటి పట్టణంలో చూడటానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

అన్ని విధాలా తీర్చిదిద్దుతున్నాం



అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతాం. ఆటలు మొదలుకొని ఆహ్లాదం వరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. రాయచోటి అభివృద్ధి వైపు పయనిస్తోంది. రాయచోటి పట్టణాన్ని సుందరంగా రూపుదిద్దేలా ముందుకు వెళుతున్నాం. రానున్న కాలంలో జిల్లా కేంద్రం అన్ని వసతులకు నెలవుగా ఉంటోంది. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు మొదలుకొని ప్రజల ఆహ్లాదానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం.

– పీఎస్ గిరీషా, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

అభివృద్ధి పరుగులు



జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు మిగతా ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం. రాయచోటి ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంలో భాగంగా అనేక రకాల పనులు చేపట్టాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో జిల్లా కేంద్రమైన రాయచోటి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతోంది. అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, రాయచోటి

నాయకత్వ పటిమతో పాఠశాలల్లో ప్రగతి

– డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం

కురబలకోట : నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం ద్వారా పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని అన్నమయ్య జిల్లా డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. మండలంలోని అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాలలో సోమవారం నుంచి మలి విడతగా నాయకత్వ లక్షణాలపై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆరు రోజుల పాటు వైఎస్సార్, అన్నమయ్య, సత్యసాయి జిల్లాకు చెందిన యూపీ స్కూళ్ల హెడ్మాస్టర్లకు రెసిడెన్సియల్ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మునుపటి కంటే పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగిందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి పిల్లలు ఎక్కువగా ఉన్నారన్నారు. వీరి తల్లిదండ్రులు బిడ్డల భావి జీవితంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. వీరి కలలను నిజం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇందుకు విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్యాబోధన, శిక్షణ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా పాఠశాలల నిర్వహణలో హెడ్మాస్టర్లదే నాయకత్వ బాధ్యత అన్నారు.

పరీక్షలను సమర్థవంతంగా నిర్వహిద్దాం

రాయచోటిటౌన్ : జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డు నిర్వహించే పరీక్షలను సమర్థవంతంగా జరపుకుందామని డీఈవో, డీసీఈబీ చైర్మన్ శ్రీరాం పురుషోత్తం పరీక్షల నిర్వహణ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అకడమిక్ క్యాలెండర్ ప్రోగ్రెస్ కార్డులు అందజేయాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇవ్వాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు.అనంతరం డీసీఈబీ వైస్ చైర్మన్ వరలక్ష్మి,సెక్రటరీ నాగమునిరెడ్డి, జాయింట్ సెక్రటరీ రామకృష్ణల ఆధ్వర్యంలో డీఈవోను సన్మానించారు.



మాట్లాడుతున్న డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలపై సానుకూలంగా స్పందిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్ వినతులు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణలు అర్జీలను స్వీకరించారు. వీటిని త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఇవీ వినతులు

రాయచోటి మండలం, మాసాపేటకు చెందిన ఎస్ చాంద్‌బాషా తనకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయించాలని స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాజంపేట మండలం, బోయనపల్లి గ్రామానికి చెందిన పి లక్ష్మీదేవి తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయించాలని అర్జీ సమర్పించారు. రామాపురం మండలం, చిల్లూరు గ్రామానికి చెందిన ఎస్ నాగయ్య సర్వే నెంబరు. 247/5లో 2.5 ఎకరాల తన భూమి ఆన్‌లైన్ చేయించాలని స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతి చేశారు. చిన్నమండెం మండలం, మల్లూరు గ్రామానికి చెందిన పి రాజన్న తనకు ఇంటిస్థలం మంజూరు చేయించాలని స్పందనలో అర్జీ అందజేశారు. ప్రజలు అందజేసిన అర్జీలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదులో వందశాతం జీఈఆర్ సాధించాలి

విద్యార్థుల నమోదులో వందశాతం స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) సాధించిన తొలి జిల్లాగా అన్నమయ్య జిల్లా నిలవాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషాపీఎస్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్ నుంచి పలు అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడిఈడు పిల్లల్ని బడికి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే చేపట్టి గుర్తించిన పిల్లలను పాఠశాలలో చేర్పించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 683 మంది వాలంటీర్లు ఇంకా సర్వే ప్రారంభించలేదని, త్వరగా వాలంటీర్లు సర్వే ప్రారంభించేలా అధికారులు గైడ్ చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించి బిల్స్ పెండింగ్‌లో లేకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జగనన్న కానుక



విద్యా దీవెన కింద రూ.24.42 కోట్లు మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

జగనన్న విద్యా దీవెన కింద 2023 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి సంబంధించిన వివరాలు

అంశం	మొత్తం విద్యార్థులు	అర్హులైన విద్యార్థులు	జమ చేసిన మొత్తం(కోట్లలో)
ఎస్సీ సంక్షేమం	4,771	4,428	రూ.3.22
ఎస్టీ సంక్షేమం	1170	1068	రూ.0.85
బీసీ సంక్షేమం	13699	12308	రూ.9.39
ఈబీసీ	4398	4180	రూ.4.00
ముస్లిం మైనార్టీ	5167	4739	రూ.3.16
కాపు సంక్షేమం	5293	4960	రూ.3.73
క్రిస్టియన్ మైనార్టీ	70	60	రూ. 0.05

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- 31,743 మంది విద్యార్థుల తల్లుల ఖాతాకు రూ.24.42కోట్లు జమ

రాయచోటి : విద్యా దీవెన.. విద్యార్థులకు వరం అని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా నగరి సభలో 'జగనన్న విద్యా దీవెన పథకం' కింద అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాకు 2023 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి సంబంధించిన నగదు జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.24.42 కోట్ల మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన కింద అర్హులైన 31,743 మంది విద్యార్థుల తల్లుల ఖాతాకు నగదు జమ చేశామని తెలిపారు. పేదరికంతో ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదని విద్యా దీవెనను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, తదితర కోర్సులు చదివే అర్హులైన పేద విద్యార్థుల ఫీజు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. విద్యార్థుల తల్లులకు ప్రశ్నించే హక్కు కల్పించి తల్లుల సాధికారతకు పట్టం కడుతోందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధికారత అధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, వివిధ సంక్షేమ అధికారులు, విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

అ'ద్వితీయ' పురస్కారం

- 574 పాయింట్లతో క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపిక
- కడప మున్సిపల్ స్కూల్ ఘనత

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు ఈ ఏడాది ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రతిభా పురస్కారం దక్కింది. రాష్ట్ర స్థాయిలో 574 పాయింట్లు సాధించి ఈ ఏడాది ద్వితీయ స్థానంలో నిలిచి రాయలసీమలో క్రీడా పతాకాన్ని ఎగుర వేసింది. 1857లో ఏర్పాటుచేసిన ఈ నగర పాలకోన్నత పాఠశాల(ప్రధాన) నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఎందరో ఉన్నత స్థాయికి చేరారు. చదువుల్లోనేగాక ఈ ఏడాది క్రీడల్లోనూ ప్రత్యేకత నిలుపుకొని జిల్లా, రాయలసీమ స్థాయిలో అగ్రస్థానంలోనూ, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలోనూ నిలిచి సత్తా చాటింది.

వరుసగా రెండో యేడాది..

రాష్ట్ర స్థాయి పురస్కారం వరుసగా రెండోసారి దక్కించుకున్న ఘనత మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)దే. అండర్-14, అండర్-17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ ఒక్క పాఠశాల నుంచే 104 మంది విద్యార్థులు పాల్గొనడం, 24 పతకాలు సాధించి రాణించడమే ఇందుకు కారణం. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో 574 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలి ప్రత్యేకతను చాటింది. ఇది వరకే రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్‌లోనూ పాఠశాలకు రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానం లభించడం విశేషం. పాఠశాల వ్యాయామోపాధ్యాయురాలు ఎల్. వెంకటలక్ష్మి క్రీడాకారుల కోసం శ్రమిస్తుండడతో విద్యార్థులు రాణిస్తున్నారు.



శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు

మెరికల్లాంటి క్రీడాకారులున్నారు



పాఠశాలలో మెరికల్లాంటి క్రీడాకారులున్నారు. తగిన విధంగా శిక్షణ ఇస్తుండటంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో యేటా పతకాలు సాధిస్తున్నా. వరుసగా రెండో ఏడాది ద్వితీయ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది. – ఎల్.వెంకటలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్, మున్సిపల్ హైస్కూల్(మెయిన్), కడప

వరుస పురస్కారాలు రావడం సంతోషంగా ఉంది



ఏటా పాఠశాలకు జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభా పురస్కారం లభించడంతోపాటు వరుసగా రెండో ఏడాది రాష్ట్ర స్థాయి క్రీడా ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధ్యాయులు కృషిచేస్తుండటం అభినందనీయం.

– పి. నాగమణి, ప్రధానోపాధ్యాయురాలు

ఫిర్యాదులపై స్పందించాలి

రాయచోటి : ప్రజలు ఇస్తున్న ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితులతో మట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ద్వారా 70 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వాటిని త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

30, 31 తేదీల్లో క్రీడాపోటీలు



కడప స్పోర్ట్స్ : అఖిల భారత సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్-2023-24లో భాగంగా శాప్ ఆదేశాల మేరకు ఈనెల 30, 31 తేదీల్లో జిల్లాస్థాయి ప్రభుత్వ శాఖల సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి.అమృత్‌రాజ తెలిపారు. 30వ తేదీన అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చదరంగం, క్రికెట్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, లాన్‌టెన్నిస్ విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31వ తేదీన స్విమ్మింగ్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్/పవర్‌లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగ, మ్యూజిక్, డాన్స్, షార్ట్ ప్లే క్రీడల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన క్రీడాకారులు సెప్టెంబర్ 4 నుంచి 8వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అన్ని ప్రభుత్వ శాఖల మహిళ, పురుష ఉద్యోగులు తమశాఖల అధిపతుల వద్ద ధృవీకరణ పత్రాలు పొంది ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కడప కలెక్టరేట్‌లోని స్టెప్/డీఎస్ఏ కార్యాలయంలో అందజేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8310170641, 9032888638 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాదంలో వివాహితకు గాయాలు

నిమ్మనపల్లె : ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో వివాహిత గాయపడిన సంఘటన సోమవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. వెంగంవారిపల్లె పంచాయతీ గండిమాలపల్లెకు చెందిన మల్లికార్జున భార్య ఎం.స్వర్ణలత (36) ఇంటి ముందు ఉన్న చెత్తాచెదారాన్ని కుప్పగా వేసి నిప్పు అంటించింది. చెత్తను కుప్పకు ఎగవేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చీరకు అంటుకుని గాయపడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అవుట్‌పోస్ట్ సిబ్బంది ప్రమాద సమాచారాన్ని నిమ్మనపల్లె పోలీసులకు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె : బాలిక అదృశ్యంపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. చిత్తూరుజిల్లా పుంగనూరు పట్టణం పోలీస్‌లైన్‌కు చెందిన బాలిక(17) ఈనెల 26న మదనపల్లె ప్రకాశంవీధిలోని బంధువుల ఇంటికి వచ్చి కనిపించకుండా పోయింది. విషయం తెలిసిన తల్లిదండ్రులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి తెలిపారు.

గొర్రె పిల్లలపై వీధి కుక్కల దాడి



వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం వీధి కుక్కలు చేసిన దాడిలో 11 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు గొర్రెల కాపరి వూసోల్ల బాబు తెలిపారు. గొర్రె పిల్లలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంచెలో రోజు మాదిరిగానే వదిలేశామన్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో కుక్కలు దాడిచేశాయని తెలియజేశారు. ఈ విషయాన్ని పశు వైద్యాధికారిణి సుష్మితకు తెలియజేశామన్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఈ యువతకు ఏమైంది?

మదనపల్లె పట్టణంలోని బి.కె.పల్లెలో ఓ మహిళ ఇంటి ముందు ఉండగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని బంగారు చైను లాక్కొని పరారయ్యారు. వీరు 25-30 సంవత్సరాల యువకులని బాధితురాలు తెలిపింది.

మదనపల్లె పట్టణంలో జనవరి నెలలో పలు ప్రాంతాల్లో జరిగిన ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో 25 నుంచి 30 సంవత్సరాల యువకులే ఉన్నారు.

మదనపల్లెకు చెందిన ఓ యువకుడు నకిలీ రికార్డులు తయారు చేసిన ద్విచక్ర వాహనాన్ని విక్రయిస్తుంచాడు. ఈ కేసులో పోలీసపులు ఇద్దరి అరెస్టు చేయగా అందులో ఓ యువకుడు కంప్యూటర్ కేంద్రం నిర్వహకుడు. చివరకు పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు.

- చెడు మార్గంలో యువత..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యావేత్తలు

మదనపల్లె సిటీ : జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రస్తుతం ఇలాంటి సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. నేరాల్లో అత్యధికంగా యువతే ఉంటుండడం కలవరపాటుకు గురి చేస్తోంది. పిల్లలపై పెద్దల పర్యవేక్షణ కొరవడటం, వారితో తగినంత సమయం గడపలేకపోవడం వంటివి ఈ తరహా ప్రవర్తనకు కారణమవుతున్నాయి. అరచేతిలో ఇమిడిన సాంకేతిక ఆయుధం సెల్‌ఫోన్ దీనికి మరింత ఆజ్యం పోస్తోంది.. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. పిల్లలే ప్రపంచంగా కష్టపడుతున్న తల్లిదండ్రులు వారితో చక్కగా మెలిగితే.. మనసు విప్పి మాట్లాడగలిగితే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పోలీసులు అధికారులు, మానసిక వైద్య నిపుణులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న మదనపల్లె డీఎస్పీ కేశప్ప

- మదనపల్లె పట్టణంలో సంచలనం కలిగించిన అధ్యాపకురాలు హత్యలో కూడా ప్రధాన నిందితులు యువకులు కావడం గమనార్హం.
- సాంకేతికతను ఉపయోగించి సైబర్ నేరాల్లో నిందితులుగా చిక్కుతున్న వారిలో ఎక్కువగా ఇంజనీరింగ్ విద్యార్థులు కావడం ఆందోళన కలిగిస్తోంది.

నైతిక విలువలు ప్రధానం



పిల్లలకు మార్కులు కాదు. బిహేవియర్ క్వాలిటీస్ ప్రధానం. నైతిక విలువలు బోధించే పెద్దలు ఇంట్లో లేకపోవడం కూడా ఇబ్బందులకు కారణమవుతోంది. నీతి శతకాలు,పురాణగాథలు చిన్నారులను సన్మార్గంలో నడిపించడానికి ఎంతో ఉపకరిస్తాయి.

-జిల్లా లలితమ్మ, బాలల హక్కుల ఐక్యవేదిక అధ్యక్షురాలు

విలువలు నేర్పించాలి



పిల్లలకు చిన్నప్పటి నుంచే విలువలు నేర్పించాలి. దీని బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు తీసుకోవాలి. పిల్లలు అధిక సమయం పాఠశాలల్లో గడుపుతారు. వారికి నీతి కథలు,మంచి,చెడు గురించి సూక్తులు బోధించాలి.

-బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్,ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, మదనపల్లె

సమాజానికి ఇవి పెను సవాళ్లే



యువత వ్యసనాలకు లోనై నేరమార్గం వైపు అడుగులు వేస్తున్నారు. మద్యం, చదువులకు క్రమంగా దూరమై కొత్తదనం కోరుకుంటూ నేరపూరిత వాతావరణంలోకి జారిపోతున్నారు. విలువలు, సామాజిక బాధ్యతతో కూడిన ప్రవర్తనను నేర్పేందుకు తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి.

- చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

అనర్థాలపై యువకులకు అవగాహన



నేరాల వల్ల జరిగే అనర్థాల గురించి యువకులకు అవగాహన కల్పిస్తాం. ఇప్పటికే పాఠశాలలు, కాలేజీలలో అవగాహన సదస్సులు నిర్వహించాం. యువత మంచి మార్గంలో నడవాలి. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. వారిని వదిలేస్తే చెడుదారుల్లో తిరుగుతూ నేరాలకు పాల్పడతారు.

-కె.కేశప్ప, డీఎస్పీ,మదనపల్లె

వీఆర్‌ఎల్ పార్సిల్ సర్వీస్‌లో పట్టుజరీ చోరీ

మదనపల్లె : వీఆర్‌ఎల్ ప్రైవేట్ పార్సిల్ కొరియర్ సర్వీస్‌లో లక్షల రూపాయల విలువైన పట్టుజరీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పార్సిల్ సర్వీస్ మేనేజర్ సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని పుంగనూరురోడ్డులోని వీఆర్‌ఎల్ కొరియర్ పార్సిల్ సంస్థకు ఇతర ప్రాంతం నుంచి చేనేత కార్మికులు పట్టు చీరల తయారీలో వినియోగించే జరీ 150 కిలోలు పార్సెల్ రూపంలో వచ్చింది. నెల కిందట పార్సెల్ సంస్థ కార్యాలయాన్ని పుంగనూరు రోడ్డు నుంచి ఇండస్ట్రియల్‌ఎస్టేట్‌కు మార్చారు. ఈ క్రమంలో చేనేత కార్మికుల కోసం పార్సిల్ రూపంలో వచ్చిన 150కిలోల జరీ మాయమైంది. ఈ విషయం గుర్తించిన మేనేజర్ హరిచరణ్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పట్టుజరీ విలువ దాదాపుగా రూ.5.32లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు.

31న ఎస్‌ఈబీ స్టేషన్‌లో వాహనాల వేలం

మదనపల్లె : ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వివిధ వాహనాలను మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో ఈనెల 31న ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.


వేలంపాటల్లో పాల్గొనే పాటదారుడు ఉదయం 9గంటలకు రూ.5,000 డిపాజిట్ చెల్లించి హాల్ టికెట్ పొందాలన్నారు. హెచ్చుపాటదారుడికి తప్ప మిగిలిన వారికి వేలం ముగిసిన వెంటనే డిపాజిట్ రుసుము వాపస్ ఇస్తామన్నారు. హెచ్చుపాటదారుడు పాడుకున్న మొత్తం పైకంపై ప్రభుత్వం నిర్ణయించిన జీఎస్టీ మొత్తాన్ని చలానా రూపంలో చెల్లించిన తర్వాత వాహనం ఉన్నది ఉన్నట్లుగా అతని స్వాధీనం చేస్తామన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముద్దాయికి జైలు శిక్ష

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన కేసులో ముద్దాయికి ప్రొద్దుటూరు కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. బాధితురాలు పాలగిరి సుబ్బరత్నమ్మ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో ముద్దాయి పఠాన్ మీర్‌ఖాన్ సోమవారం ఏజేఎఫ్‌సీఎం కోర్టు జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధించింది.

బాబోయ్ పులి!

- పొలాల్లో పులి పాద ముద్రలు?
- భయపడుతున్న రైతులు, ప్రజలు



పులి పాద ముద్రలేనని అనుమానం వ్యక్తం చేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లి సమీప పొలాల్లో పులి సంచరిస్తోందని చుట్టుపక్కల రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఓ పొలంలో రైతుల కంట పడిన ముద్రలు చూసి ఇవి పులి పాద ముద్రలేనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం కూడా మిట్టసానిపల్లి సమీప పొలాల్లో పులి సంచరిస్తోందని పుకార్లు రావడంతో అటవీ శాఖ అధికారులు మాత్రం పులి కాదు హైనా అని చెబుతున్నారు. ఈ ప్రాంత రైతులు మాత్రం రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఫారెస్ట్ జిల్లా ఉన్నతాధికారులు అటవీ ప్రాంతాలను, పొలాలను క్షుణ్ణంగా పరిశీలించి పాద ముద్రలపై ఖచ్చితమైన నిర్ధారణ చేసి రైతుల అనుమానాలను నివృత్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బంగారు సొత్తు చోరీపై కేసు నమోదు

మదనపల్లె : బంగారు సొత్తు చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. పట్టణంలోని బసినికొండకు చెందిన రెడ్డి అరుణ ఈనెల 24న కదిరిలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. బస్టాండ్‌లో ఆమె బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అందులో దాదాపు రూ.90వేల రూపాయల విలువ చేసే 30 గ్రాముల బరువు కలిగిన బంగారుగాజులు ఉన్నాయని బాధితురాలు సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని మాడపూరు చెరువు కట్టపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కోనరాజుపల్లెకు చెందిన కాకర్లరామకృష్ణ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమర్ తమ ద్విచక్ర వాహనాల్లో ఎదురెదురుగా వస్తూ మాడపూరు చెరువు కట్టపై ఢీకొన్నాయి. ఇందులో రామకృష్ణ, అమర్‌లకు గాయాలయ్యాయి. 108 వాహనంలో వారిని బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని యువతి మృతి



ముంతాజ్ మృతదేహం

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన ముంతాజ్ (18) అను యువతి సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ముంతాజ్ తల్లి కువైట్‌లో ఉంది. ఆదివారం రాత్రే తల్లితో ఫోన్‌లో మాట్లాడింది. తర్వాత తెల్లవారుజాము సమయంలో ఉరేసుకుంది. పని నిమిత్తం కడపకు వెళ్లిన తండ్రి దర్బార్ బాషా రాత్రికి ఇంటికి రాలేదు. ముంతాజ్ తమ్ముడు రాత్రి మిద్దెపై పడుకున్నాడు. సోమవారం ఉదయం లేచి తలుపులు కొట్టాడు. ఎంత సేపటికి తలుపులు తెరవకపోవడంతో తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే ఉరి వేసుకొని చనిపోయింది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరెంట్ షాక్‌తో బేల్దారి...



కరెంట్ షాక్‌తో మృతి చెందిన కుళాయప్ప

పెద్దముడియం : మండలంలోని భూతమాపురం గ్రామంలో గుర్రాల సాయి కుళాయప్ప (36) అనే బేల్దారి కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నంద్యాల జిల్లా అక్కంపల్లె గ్రామానికి చెందిన కుళ్లాయప్ప బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి భార్య,ఒక కుమారుడు,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుళ్లాయప్ప మండలంలోని భూతమాపురం గ్రామంలో ఇంటి గోడకు గోడకు నీరు పట్టే సమయంలో మోటర్‌కు ఉన్న పైపు ఊడిపోయింది. దీంతో కుళాయప్ప మోటర్‌కు పైపు తగిలిస్తుండగా కరెంట్ షాక్ కొట్టడంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు.మృతుని భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయాలు సంస్కృతికి నిలయాలు



ప్రభుత్వ కార్యదర్శి హరిజవహర్‌లాల్, జేసీ అహ్మద్‌ఖాన్‌లకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

చిన్నమండెం : దేవాలయాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు అని ప్రభుత్వ కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు సాగుతున్నాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరిజవహర్‌లాల్ జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ తాను ఇక్కడే విద్యాభ్యాసం సాగించానని, ఇక్కడే చదివి తాను ఐఏఎస్‌కు కూడా ఎంపికైన నట్లు తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అందించిన విశేష కృషితో ఆలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూమసాని అంజలి, లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ శ్యాంచందర్, డాక్టర్ చిన్నరెడ్డి, సరోజమ్మ దంపతులు, ఎండోమెంట్ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అన్ని గ్రామ సమాఖ్యల్లోనూ ఆడిట్

సాక్షి ఎఫెక్ట్..

పెద్దతిప్పసముద్రం : వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం పరిధిలో పని చేస్తున్న సంఘమిత్రల హడావుడిగా సీసీలు సమావేశం నిర్వహించారు.సంఘమిత్రలతో చేతివాటంపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం వెలువడిన 'సంఘమిత్రల చేతివాటంలో సీసీలకూ వాటా' కథనంతో సీసీలు హుటాహుటిన మండలంలోని సంఘమిత్రలతో సమావేశం అయ్యారు. మండలంలోని 34 గ్రామ సమాఖ్యలు, 37 మంది సంఘమిత్రల పరిధుల్లోనూ తనిఖీ బృందం సమగ్రంగా ఆడిట్ నిర్వహిస్తుందన్నారు. సంఘాలకు మంజూరు చేసిన బ్యాంకు రుణాలు,ఉన్నతి, స్త్రీ నిధి, సీఐఎఫ్ రుణాలతో పాటు నెలవారి పొదుపు, బ్యాంకులకు జమ చేసిన చెల్లింపు రికార్డులను క్షుణంగా పరిశీలిస్తారన్నారు. ఇక నుంచి ఏ సంఘమిత్ర కూడా గ్రూపు సభ్యుల నుంచి నయా పైసా కూడా వసూలు చేయరాదని, సీసీలకు, ఉన్నతాదికారులకు కూడా సంఘమిత్రలు ఎలాంటి నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని హితబోధ చేశారు. అదే విధంగా పల్లెబాటలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సంఘమిత్రలదే అని సూచించారు. అయితే సీసీలు తమ వద్ద డబ్బులు తీసుకుని ఇప్పుడు నీతి మాటలు వల్లిస్తే ఆడిట్‌లో నిధుల దుర్వినియోగం బట్ట బయలు అయితే రికవరీ బాధ్యతలు ఎవరు భరిస్తారని పలువురు సంఘమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లెక్చరర్ హత్యకేసులో మరో మహిళ అరెస్ట్

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ కాలేజ్ లెక్చరర్ రుక్సానా హత్యకేసులో మరో మహిళా నిందితురాలు ఇర్షత్ అంజుమ్‌బేగంను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఇన్‌చార్జ్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 3న పట్టణంలోని ప్రశాంత్‌నగర్ సిద్ధార్థ కాలేజ్ రోడ్డులో సాయంత్రం 5.30 గంటల సమయంలో హత్యకు గురైన లెక్చరర్ రుక్సానా హత్యకేసును ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు సాగించామన్నారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 12 మందిపై కేసు నమోదుచేయగా, హత్య జరిగిన 24గంటల్లోపు ప్రధాన నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. ఆ మరుసటిరోజు కేసులో ప్రమేయం ఉన్న రుక్సానా భర్త ఖదీర్‌అహ్మద్‌తో పాటు నలుగురిని, కొద్దిరోజుల తర్వాత మరో ముగ్గురిని, రెండురోజుల క్రితం ప్రధాన మహిళా నిందితురాలైన ఆయేషాను, సోమవారం నేరానికి సహకరించిందన్న అభియోగంపై ఇర్షత్ అంజుమ్‌బేగంను అరెస్ట్ చేశామన్నారు. హత్యకేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

టీడీపీ నేత ఫామ్‌హౌస్‌లో పోలీసుల తనిఖీ



ముంబై డ్రగ్స్ మాఫియా సేదతీరిన టీడీపీ నేత ఫామ్‌హౌస్‌లో పరిశీలిస్తున్న డీఎస్పీ ,సీఐ

రాయచోటి : ముంబై డ్రగ్స్ మాఫియా ముఠా సభ్యుడు విడిది చేసిన టీడీపీ నేత ఫామ్‌హౌస్‌ను రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. సోమవారం రాయచోటి–రాజంపేట మార్గంలోని ఓదివీడు సమీపంలో ఉన్న టీడీపీనేత ఫామ్‌హౌస్‌ను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రగ్స్ మాఫియాతో టీడీపీ నాయకులకు సంబంధాలు ఉన్నాయన్న ప్రచారం ఆ పార్టీ నాయకులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో డ్రగ్స్ మాఫియా కలకలం వారిలో మరింత వేదనకు గురిచేస్తోంది. మరోవైపు కేసు నుంచి బయటపడేందుకు ఆ పార్టీ సీనియర్ నేతల నుంచి పోలీసులపై ఒత్తిడిలు తెస్తున్నట్లు సమాచారం. వారం రోజుల కిందట డ్రగ్స్ మాఫియా సభ్యుడిని ముంబై పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. అతని అరెస్టుతో పాటు అక్కడే ఉన్న కొంత మాదక ద్రవ్యాన్ని కూడా ముంబై పోలీసులు స్వాధీనం చేసుకుని పట్టుకెళ్లారు. డ్రగ్స్ ముఠా మాఫియాతో టీడీపీ నేతకున్న సంబంధాలపైన కూడా పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఆశ్రయం కల్పించిన ఆ టీడీపీ నేతకు చెందిన సిమ్ కార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలన చేస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వారి కుటుంబసభ్యుల సెల్‌ఫోన్ నెంబర్లను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. విడిది చేసిన ఫామ్‌హౌస్‌ను, పరిసర ప్రాంతాలను కూడా పరిశీలించి పలు అనుమానాలను నివృత్తి చేసుకున్నామని పోలీసు అధికారులు చెబుతున్నారు. మాఫియా ముఠా పరిస్థితులపై ముంబై పోలీసులు అందించే సమాచారం కోసం వేచిచూస్తున్నామని సీఐ తెలిపారు. డ్రగ్స్ మాఫియా సభ్యుడితో టీడీపీ నేతకున్న సంబంధాలు, ఈ ప్రాంతంలో మరేతర వారితో ఉన్న వ్యాపార సంబంధాల పైన కూడా మా కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా డ్రగ్స్ ముఠా సభ్యుడికి ఆశ్రయంకల్పించిన టీడీపీ నేతపై ఆ పార్టీ నేతలు సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.

నగరిగుట్టలో నాకాబందీ



నగరిగుట్టలో నాకాబందీ నిర్వహిస్తున్న డీఎస్పీ వినోద్ కుమార్, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట ప్రాంతంలో సోమవారం పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలోని అనుమానాస్పద స్థావరాలపై తనిఖీలు నిర్వహించామన్నారు. పట్టణంలోని నగరిగుట్ట, క్రిష్టియన్‌లైన్, యర్రగుడివల్లె ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. తప్పు చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా, అక్రమ మద్యం అరికట్టడంలో భాగంగా ఇప్పటివరకు 80 కేసులు నమోదు చేసి 100 మందికి పైగా అరెస్టు చేయడంతో పాటు పలు బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే 9121100544, 9121100546, 9121100547 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. పులివెందుల అర్బన్ సీఐ రాజు, వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు, ఆర్కేవ్యాలీ సీఐ గోవింద రెడ్డి, ఎస్సైలు సత్యనారాయణ, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

అమృతానగర్‌లో కార్డెన్ అండ్ సెర్చ్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని అమృతానగర్‌లో సోమవారం ఉదయం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ ఇన్‌చార్జి సీఐ యుగంధర్, టూటౌన్ సీఐ ఇబ్రహీం, త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్, సిబ్బందితో కలసి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 20 మోటార్ బైక్‌లను, 3 ఆటోలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తులు ఎవరైనా వీధుల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాజుపాళెం ఎస్‌ఐ రాజగోపాల్ పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య





గంగులయ్య మృతదేహం, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దువ్వూరు : మండలంలోని నేలటూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చిన్నమూ గోళ్ల గంగులయ్య (27) అనే యువకుడిని గ్రామ సమీపంలోని పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. వృత్తిరీత్యా గంగులయ్య డ్రైవర్. కొంతకాలంగా భార్యతో దూరంగా ఉంటున్న ఇతను మరో మహిళతో వివాహేతర బంధంలో ఉన్నట్లు స్థానికుల సమాచారం. హత్య విషయాన్ని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న మైదుకూరు ఇన్‌చార్జి డీఎస్పీ మహబూబ్‌షరీఫ్, మైదుకూరు అర్బన్, రూరల్ సీఐలు శ్రీనాథ్‌రెడ్డి, చలపతి, ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సంఘటన స్థలానికి పిలిపించి రక్తన మూనాలను సేకరించినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కాగా వివాహేతర బంధమే హత్యకు కారణమని.. ఇప్పటికే నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.